
# కొసరు పండు

## - ద్వివేదుల సోమనాథ శాస్త్రి




మామిడి పళ్లు తీసుకురండి అని యింట్లో పోరు పెడుతున్నారు. నిజమే! యిప్పటికే ఆలశ్యం అయింది. మామిడి పళ్ళ సీజను వచ్చేసి పది రోజులయింది. దేముడికి ముందు యిస్తేనేగాని మా ఆవిడ తినదు అదోనియమం. ఇంట్లో అందరూ తింటూంటే ఆమె ఒక్కర్తీ తినకుండా ఉండడం బావుండదు కదా.

ఈ నియమం కొంత నయం, కొందరయితే భక్తి ముదిరి - ఏ కాశీలోనో గయలోనో, ప్రీతి పాత్రమయిన మామిడి పండును జీవితాంతం తినమని భగవదర్పితం చేసి త్యాగం చేస్తారు! ఎలా ఉండగలరో మరి!

ఇంకా ఆలశ్యం చేస్తే 'ఆబోరు' దక్కదని బజారుకు బయలుదేరాను. దుకా ణంలో అన్ని రకాల పళ్లూ గోపురాల్లా పేర్చి అందంగా ఉన్నాయి. బంగినిపల్లి పళ్లు బంగారంలా మెరిసిపోతున్నాయి. సువర్ణరేఖ పళ్లు - ముద్దు గుమ్మల కందిన బుగ్గల్లా ఎర్రగా, పచ్చగా నిగనిగలాడుతున్నాయి.

దుకాణం వాడిని ధర అడిగితే - పెద్ద సైజు పళ్లు నూరు, మధ్య రకం సైజు ఎనభై, చిన్న రకం సైజు అరవై అనీ చెప్పాడు. వందా, ఏభై కాదుట డజను పళ్ల రేటుట అది!

ఎంత రేటు చెప్పినా తప్పదు కదా! మధ్య తరగతి వాళ్లం కాబట్టి మధ్యరకం పళ్లనే డజను తీసుకున్నాను! మరో పండు తీసి "డజను తీసుకున్నాను కదా ఈ ఒక్కటీ కొసరియ్యి!" అని అడిగాను.

"ఏటి బాబూ వందో రెండొందలో తీసుకున్నట్టు అడుగుతావు? పెట్టక్కడ! మాకు వందకాడ ఒక్కటియ్యనేదు!" అన్నాడు చేతిలోంచి పండు లాక్కుంటూ

"పోనీ యీ చిన్న పండియ్యవయ్యా!" అని అడిగాను వదలకుండా!

ఎల్లెల్లవయ్యా యిలాటి బేరం వస్తే మేం బతికినట్టే!" అని చెయ్యి తోసేశాడు ఆ పండు చేతిలో పెట్టి - ఏ కళ నున్నాడో ఏమో!

అంటే అన్నాడులే కొసరు పండు యిచ్చాడు కదా అని ఆ పండును చూసుకుంటూ సంచీలో వేసుకుని మురిసిపోయాను.

బేరం ఆడిన డజను పళ్ల కన్న వాడు కొసరు యిచ్చిన ఆ పండే ఎంతో విలువయిందిగా అనిపించింది. అందికే కాబోలు అసలు కన్నా 'కొసరు' మిన్న అంటారు.

ఏదయినా అంతేకదా! చూడండి! యిప్పుడు క్రొత్తగా వ్యాపారస్తులు ఒకటి కొంటే ఒకటి ఫ్రీ! అని సరుకులు అమ్ముతున్నారు వెంటనే వెళ్లి అవి కొనేస్తున్నాం ఆ వ్యాపారి ఆ వస్తువు ఖరీదును రెండింతలు ముందే పెంచి - ఆ ఒక్కటి ఉచితంగా యిస్తున్నట్టు ఎర చూపుతున్నాడు - ఆ సంగతి తెలిసినా మనం ఆ ఫ్రీ వస్తువు మీద మోజు పడి కొనేస్తున్నాం.

అలాగే వస్త్ర వ్యాపారులు రెండు వేలు ఖరీదు చేసే బట్టలు కొంటే ఒక గోనె గుడ్డ బ్యాగు ఉచితంగా యిస్తారు - ఆ గోనె సంచి కోసం ఆశపడి అవసరం లేకపోయినా బట్టలు కొనేసి ఆ సంచిని అపురూపంగా తెచ్చుకుంటాం. ఇంతా చేస్తే ఆ సంచి ఖరీదు బజారులో 20 రూపాయిలు మాత్రమే.

ఇదంతా వాళ్ల వ్యాపారం అభివృద్ధి చేసునేందుకో లేక చెల్లని సరుకుని వదుల్చుకునేందుకో చూపే ఆకర్షణ అన్నమాట. ప్రజలకు కొసరు మీద అంత రుచి అన్నమాట. ఈ బలహీనతను డబ్బు చేసుకుంటున్నారు వాళ్లు.

మోటుగా ఉంటుందేమో గాని - ఆఖరికి ఆడ పిల్లలే గల తల్లి తండ్రులు కూడా కట్నాలిచ్చుగోలేక "ఒక అమ్మాయిని చేసుకుంటే మరొక అమ్మాయి ఫ్రీ" అని అన్నంతవరకూ యీ ఫ్రీ సంస్కృతి వస్తుందేమోనని భయం వేస్తోంది.

మా చిన్న తనంలో వేసవి శలవలకి తాతగారి ఇళ్లకు వెళ్లే వాళ్లం అక్కడ వాళ్లకి తోటలూ, పొలాల్లూ ఉండేవి. మామిడి తోటల నుండి మామిడి కాయలు వచ్చేవి. ఆవకాయ పెట్టడం

అయ్యేక పళ్లకోసం కాగులు వేసేవారు. కావలసినప్పుడల్లా కాగుల్లోంచి పండిన పళ్లను తీసుకుని యిష్టమొచ్చినన్ని తినే వాళ్లం అలా ఏటి ఒడ్డుకు పోయి, ఆడుకుంటూ తింటూంటే వాళ్లం తోటల్లోకి వెళితే అడక్కుండానే చెట్టు నుండి పళ్లు కోసుకొని తినమనేవారు. ఆ రోజులే వేరు.

ప్రతి తోటలోనూ తోట గలవాళ్లు తమ కోసమని ప్రత్యేకమయిన అరుదయిన పళ్లు కాసే చెట్లను పెంచేవారు అలాటి వాటిల్లో "ఇమాంపసందు" "జహంగీర్" "రాజమాను" "రసాలు" యిలా ప్రత్యేకించి పండించేవారు, ఆవకాయలకని, కోలంగోవ, పడియా, కలెక్టరు, బారామాసి, యిలాటి రకాలు, యింక అందరికీ అందుబాటులో ఉండే బంగినపళ్లు, సువర్ణరేఖ, నీలం, గోవా, కొబ్బరంట్లు - యిలాటి రకాలు ఎన్నో.

ఇమాంప సందు, జహంగీరు, వీటి రుచేవేరు, కమ్మని వాసనతో ఎంతో మధురంగా ఉండేవి ఒక్క పండు తింటే చాలు కడుపునిండి పోయేది.

ఇప్పుడంటే తయారు చేసిన ఆవకాయలు మార్కెట్లో, పేకెట్లలోనూ సీసాల లోనూ కొనుక్కుంటున్నాం గాని - ఒకప్పుడు ఆవకాయ సీజను వచ్చిందంటే ప్రతి యింట్లోనూ ఒక 'ఆవకాయ యజ్ఞమే' అప్పుడే దిగిన మామిడి పింజలతో 'పచ్చడి బద్దలు' చేసేవారు కసరు కసరుగా చెప్పలేని రుచిగా ఉండేవి.

పూర్వం గొట్టి శాస్త్రి గారని ఒక పండితుడు చెప్పే కవిత్వం చాలా గొప్పగా ఉండేదట. ఆ కవిత్వాన్ని మెచ్చుకుందికని

"ఏమి తిని సెపితివి కవితము?
పచడి బదలు తిని సెపితివా?"

అని అంటూండేవారట! అంటే అంత రుచిగా ఉండేవన్న మాట ఆ కసరు మామిడి పిందెల పచ్చడి బద్దలు. అలాగే చిన్న లేత మామిడి కాయల్ని ఉప్పు, కారం కలిపిన నీటిలో ఊరవేసి స్కూళ్ల దగ్గిర అమ్మేవారు మామిడి కాయలు అమ్మే చోటే మేదర వాళ్లు మనకు కావల్సిన సైజులో కాయలను కత్తితో కొట్టి యిచ్చేవారు. వాటికి తగ్గ ఆవకారం, నూనె కలిపి కత్తిరి ముక్కలు పోసేవారు. ఎండలు మండి పోతున్నా ఆ ఆవకాయి ఊటతో ముక్కల్ని తింటూంటే స్వర్గం బెత్తెడు దూరంలో ఉండేది. మంచి కోలంగోవా కాయల్ని ఎంచి, వాటిని నాలుగు ముక్కల్లా తెగిపోకండా కోసి వాటిల్లోని జీడిని జాగ్రత్తగా డబ్బులంతో తీసి శుభ్రపరచి వెల్లుల్లిపాయలతో కూడిన ఆవ పిండి దట్టించి జాడీల్లో ఉంచితే ఊట ఊరేది. ఆ కాయలను రోజూ ఎండ బెట్టి మళ్లీ ఊటలో నానబెట్టి అలా ఆ ఊట ఎండే వరకూ కాయలను ఎండబెట్టేవారు. ఆఖరికి ఆ ఊటంతా పిండిలా ఎండిపోయేది. అప్పుడా కాయల పొళంగా ఉండే ఆవకాయలను ముక్కలుగా కోసుగొని చద్దన్నాలతో తినేవాళ్లం. ఆ ఆవపిండి తింటూ ఆ టెంకలను చప్పరిస్తూంటే ఆ రుచి దేనికీ సాటి ఉండదు. ఇలాగే మాగాయ, మామిడి కాయల్ని సన్నంగా కోరి చేసే కోరు పచ్చడి. యిలా ఎన్నో రకాలు యింట్లోనే చేసేవారు. ఆ ఆవకాయ రోజుల్లో యిల్లంతా ఆవకాయ ఘుమఘుమలతో నిండిపోయేది.

కాయల లోంచి వచ్చిన జీడిని తీసుకుని - ఎవరో ఒక స్నేహితుడి పేరుతో "జీడికి రాజు రామారావు" అనో జీడికి రాజు మూర్తి" అనో గోడల మీద రాసి ఉడికించేవారు - ఆ రాతలు మళ్లీ సున్నాలు రాస్తే గాని పోయేది కాదు!

బాగా మగ్గిన పళ్లు గంగాళాలలో పిండి డాబాల మీద తాటాకు చాపలు పరచి ఆ పళ్లరసాన్ని దొరలు పొరలుగా రెండు మూడు అంగుళాల దళసరి అయేవరకూ పోసి ఎండ బెట్టి తాండ్ర చేసేవారు. ఇవన్నీ కూడా ఏడాది పొడవునా ఉండేవి. తాము తినడమే కాకుండా బంధువులకి, స్నేహితులకి కూడ పంపేవారు.

వైశాఖ మాసంలో పెళ్లిళ్లయితే విందులలో మామిడి పళ్లు వడ్డించేవారు మామిడి పళ్లతో సంభావన లిచ్చేవారు! తెనాలి రామలింగడి కథల్లో మామిడి పళ్ల సంభావన. ప్రహసనం అందరికి తెలిసిందే కదా!

ఆ తర్వాత తోటలూ అవీ పోయాక సంతల్లో వందల లెక్కల్లోనో, గంపలతోనో మామిడి పళ్లు కొనుక్కుని యింటికి పిల్లా పాపా వస్తే యిచ్చేవాళ్లం. రానురాను ఏభైలూ, పాతికలూ పోయి డజన్ల లెక్కన కొనుక్కునే రోజులు వచ్చాయి ముందు ముందు ఎవరికి వారే ఒక్కో పండు కొనుక్కు తినే రోజులు కూడా వస్తా ఏమో!

ఇంట్లో అరడజను మంది వున్నాం. పెద్దలు నలుగురం, పిల్లలు యిద్దరూ. దేముడికి, ముత్తయిదువుకి నాలుగు పళ్లు పోగా 8 + 1 కొసరు పండు మిగులుతాయి 8 పళ్లూ అయిపోతాయి. యింక కొసరు పండు ఒక్కటి మిగులుతుంది. నానా చీవాట్లూ తిని తెచ్చుకున్నాను కాబట్టి అది నాకే...

కొసరిచ్చిన పండు రుచి మిగతావాటికెలా వస్తుంది?

మామిడి పళ్లను చూడగానే వెనకటి రోజులు గుర్తుకు వచ్చి అవన్నీ తలుచుకుంటూ, ఇంటికి వచ్చాను.

రాగానే పిల్లలిద్దరూ సంచీలోంచి ఒక్కొక్కటీ లాక్కొని లాగించేశారు. నాకు భోజనం చేస్తూ మామిడి పండు తింటూంటే చాలా యిష్టంగా ఉంటుంది. అందుకని వాళ్లతో పాటు నేను తినలేదు. అందరూ ఎవరి కోటా వాళ్లు తినేశారు! నేనూ మా ఆవిడా, తప్పించి.

దేముడికి, ముత్తయిదువుకి నాలుగు, నాకూ, మా ఆవిడకూ రెండూ + కొసరు పండూ మిగిలేయి! నేను సాయంత్రం లైబ్రరీకి వెళ్లి వచ్చేసరికి రాత్రి ఏడు గంటలయింది. ఎనిమిదిన్నరకల్లా భోజనం చేయడం అలవాటు. భోజనం చేస్తున్నాను గాని నా దృష్టి అంతా మామిడి పండు మీదే ఉంది! కానీ... మజ్జిగా అన్నంలోకి వచ్చినా ఆ ఊసే లేదు... యింక ఉండబట్టలేక.

"మామిడి పండేదీ?" అని అడిగాను.

"మా ఆవిడ తలవంచుకుని - చెప్పలేక చెప్పలేక -

"కోవెలలో దేముడికి, అక్కడ ముత్తయిదువుకీ నాలుగు పళ్లు యిచ్చానా - యింక మనిద్దరికీ రెండు పళ్లు మిగిలాయి నేను యింటికి వచ్చి ఒక పండు తిని - మీ కోసం ఒకటి ఉంచాను..... యింతలో లక్ష్మమ్మ పిన్నిగారు వచ్చారు రాకరాక వచ్చారు కదా అని ఆ పండు తాంబూలంలో పెట్టి యిచ్చేశాను" అని అన్నది.

"మరి కొసరు పండో?" అని అడిగాను ఆశతో

"తాంబూలం యిస్తూ ఒక పండు పెడితే ఏం బాగుంటుందండీ అంచేత ఆ పండు కూడా యిచ్చేశాను!" అన్నది చల్లగా. అది విని ఏం మాట్లాడలేక పోయాను.

మళ్లీ కొనాలంటే యింతమందికీ డజను పళ్లు కొనాలి! పోనీ ఒక్క పండు కొనుక్కుని ఏ పార్కులోనో తినేద్దామంటె పండు ఒక్కటికి పది రూపాయిలు తక్కువ లేదు! అమ్మ బాబో నా తరమా."

అలా ఆఖరికి ఎంతో కష్టపడి తెచ్చుకున్న కొసరు పండు కూడా తినడానికి ప్రాప్తం లేకపోయింది! ❋